క్లుప్తంగా

గూడెంలో పవిత్రోత్సవాలు ప్రారంభం


ఉత్సవాల్లో పూజలు చేస్తున్న పూజారులు

దండేపల్లి: శ్రావణ మాసం పురస్కరించుకొని దండేపల్లి మండలం గూడెం శ్రీ సత్యనారాయణ స్వామి ఆలయంలో శనివారం పవిత్రోత్సవాలు అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. ఈ పవిత్రోత్సవాలు మూడు రోజుల పాటు నిర్వహించనున్నారు. మొదటి రోజు అఖండ దీపారాధన, విశ్వక్సేనరాధన, వాసుదేవ పుణ్యాహవచం, అంకురార్పణం తదితర కార్యక్రమాలను నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ఈవో శ్రీనివాస్, ప్రధాన అర్చకులు రఘుస్వామి, సంపత్ స్వామి, అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డుపై నాటేసి నిరసన


బురద రోడ్డుపై నాటేస్తున్న గిరిజనులు

దండేపల్లి: మండలంలోని కోయపోచగూడకు వెళ్లే దారి బురదమయంగా మారింది. దీంతో అక్కడి గిరిజనులు బయటకు రాకపోకలు కొనసాగించడానికి ఇబ్బంది పడుతున్నారు. బురదకష్టాలు తీర్చడంలో అధికారులు గాని, ప్రజాప్రతినిధులు గాని పట్టించుకోవడం లేదని ఆరోపిస్తూ రోడ్డుపై నాటు వేసి నిరసన తెలిపారు. సీపీఎం నాయకులు రవి, అశోక్‌లతో పాటుగా గిరిజనులు నాటేశారు. అధికారులు దృష్టి సారించి వెంటనే రోడ్డుకు మరమ్మతు చేసి బురద కష్టాలు తీర్చాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు రాములు, ఎల్లయ్య, రమేశ్, వెంకటేశ్, పోచన్న, సునీత, ఆదివాసి గిరిజనులు పాల్గొన్నారు.

'అంబేద్కర్ భవన స్థలాన్ని కబ్జాకు గురికానివ్వొద్దు'


వినతిపత్రం ఇస్తున్న నాయకులు

బెల్లంపల్లిరూరల్: బెల్లంపల్లిలో నిర్మిస్తున్న అంబేద్కర్ భవనాన్ని, స్థలాన్ని కబ్జాకు గురికాకుండా కాపాడాలని దళిత సంఘాల ఐక్య వేదిక నాయకులు కోరారు. మున్సిపల్ కమిషనర్ కె.శ్రీనివాస రావుకు శనివారం వినతి పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో దళిత సంఘాల ఐక్య వేదిక నాయకులు కుంబాల రాజేష్, దుర్గం గోపాల్, రత్నం ఐలయ్య, రాజనర్సు, మురళి, శ్రీనివాస్, చంద్రశేఖర్, గోపి తదితరులు పాల్గొన్నారు.

ఐటీఐ ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు స్వీకరణ


బాధ్యతలు స్వీకరిస్తున్న రాములు

జన్నారం: మండల ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్‌గా బండి రాములు శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఇన్ని రోజులు ఇక్కడ పని చేసిన ప్రిన్సిపాల్ శ్రీనివాస్ ఆదిలాబాద్‌కు బదిలీపై వెళ్లగా, రాజన్న సిరిసిల్లా నుంచి రాములు బదిలీపై వచ్చారు. ఆయనకు ఐటీఐ సిబ్బంది స్వాగతం పలికారు. అనంతరం బాధ్యతలు స్వీకరించారు. విద్యార్థులు క్రమశిక్షణతో శిక్షణ పూర్తి చేసేలా తగు చర్యలు తీసుకుంటానని తెలిపారు.

డీపీవో ఆకస్మిక తనిఖీ


ఓటరు నమోదును పరిశీలిస్తున్న డీపీవో

జన్నారం: మండల కేంద్రంలోని ఆశ్రమ పాఠశాలను శనివారం మంచిర్యాల జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వర్ రావు ఆకస్మికంగా తనిఖీ చేశారు. కిచెన్ షెడ్డు, పాఠశాల పరిసరాలను పరిశీలించారు. ప్లాస్టిక్ నిషేధంపై, సీజనల్ వ్యాధులపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనంతరం ఎంపీడీవో కార్యాలయంలో ఓటర్ లిస్టు నమోదు విధానం పరిశీలించారు. ఓటర్ మెర్జింగ్ విధానంపై ఎంపీడీవో శశికళను అడిగి తెలుసుకున్నారు. గ్రామాల్లో పర్యటిస్తూ పారిశుద్ధ్య పనులు ఎప్పటికప్పుడు పరిశీలించాలని, సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఆయన వెంట ఎంపీవో జలందర్, ఏపీవో రవీందర్, ఈవో రాహుల్ తదితరులున్నారు.

గోకులకృష్ణా.. గోపాలకృష్ణా

- పాఠశాలల్లో ముందస్తు కృష్ణాష్టమి
- ఉట్టి కొట్టిన విద్యార్థులు
- కృష్ణుడు, గోపికమ్మ వేషధారణలో అలరించిన చిన్నారులు


మంచిర్యాలఅర్బన్: ట్రినిటీ హైస్కూల్‌లో శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణలో చిన్నారులు


రాంపూర్‌లో కృష్ణాష్టమి వేడుకలు

భీమారం/మంచిర్యాలఅర్బన్/చెన్నూర్/కోటపల్లి/భీమిని/కాసిపేట/మందమర్రిరూరల్/రామకృష్ణాపూర్/జన్నారం: జిల్లా వ్యాప్తంగా పలు ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో శనివారం ముందస్తుగా శ్రీ కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. సంస్కృతి సంప్రదాయాల్లో భాగంగా ఉట్టికొట్టడం, పలు సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. చిన్నారుల శ్రీ కృష్ణుడు, గోపికల వేషధారణలు ఆకట్టుకున్నాయి.


కాసిపేట: సోమగూడంలో గోపిక వేషధారణలో చిన్నారి


శ్రీకృష్ణుడు, గోపిక వేషధారణలో చిన్నారులు


రామకృష్ణాపూర్: వేడుకల్లో పాల్గొన్న విద్యార్థులు


మంచిర్యాలఅర్బన్: స్మార్ట్ కిడ్స్ పాఠశాలలో గోపికలు, కృష్ణుడి వేషధారణలో చిన్నారులు


జన్నారం: వివేకానంద పాఠశాలలో...


బూర్గుపల్లి ప్రభుత్వ పాఠశాలలో...


కన్నెపల్లి పాఠశాలలో...


మంచిర్యాలఅర్బన్: అల్ఫోర్స్ హైస్కూల్‌లో...

బూర్గుపల్లిలో 'కమ్యూనిటీ కాంటాక్ట్'

- నేరరహిత గ్రామాల కోసం సహకరించాలి
- సీఐ మోహన్


ప్రజలతో మాట్లాడుతున్న సీఐ మోహన్

భీమారం: నేరరహిత గ్రామాల కోసం ప్రజలు సహకరించాలని శ్రీరాంపూర్ సీఐ మోహన్ కోరారు. మండలంలోని బూర్గుపల్లిలో శనివారం పోలీసుల శాఖ ఆధ్వర్యంలో కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో నేరాలు అదుపులోకి వస్తే, ఆ గ్రామాలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతాయన్నారు. ముఖ్యంగా ప్రజలతో సత్సంబంధాలు పెంపొందించేందు కోసం ఈ కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. పట్టణాల్లో మాదిరిగానే గ్రామాల్లో కూడా కొత్తవారు సంచరిస్తే తెలియని పరిస్థితి నెలకొందని, అనుమానాస్పదంగా ఎవరైనా సంచరిస్తే ప్రజలు పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో ఎస్సైలు బి.రాములు(భీమారం), సంతోష్ (శ్రీరాంపూర్), నాగరాజు(జైపూర్), ఎక్సైజ్ ఎస్సై మనీషాతో పాటు వివిధ పోలీసుస్టేషన్ల సిబ్బంది పాల్గొన్నారు.

బెల్లం పానకం పారబోత..

గ్రామంలోని ఇంటింటిని పోలీసులు తనిఖీ చేయగా 16లీటర్ల గుడుంబా, గుడుంబా తయారీకి ఉపయోగించే 200లీటర్ల బెల్లంపానకం లభించినట్లు సీఐ మోహన్ తెలిపారు. సరైన పత్రాలు లేని 34మోటారుసైకిళ్లని స్వాధీన పర్చుకున్నట్లు తెలిపారు.

సంక్షిప్త వార్తలు

సబ్‌స్టేషన్‌లో నూతన బ్రేకర్ ప్రారంభం

భీమిని: కన్నెపల్లి మండలంలోని గ్రామాలకు విద్యుత్ అంతరాయం కలగకుండా ఉండేందుకు శనివారం కన్నెపల్లి సబ్‌స్టేషన్‌లో 33/11కేవీ రూ.8.50లక్షలతో నూతన బ్రేకర్‌ను మంచిర్యాల జిల్లా సూపరింటెండెంట్ ఇంజనీర్ శ్రావణ్‌కుమార్ ప్రారంభించారు. దీంతో కన్నెపల్లి మండలంలోని పలు గ్రామాల ప్రజలకు నిరంతరంగా విద్యుత్ సేవలు అందుతాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో బెల్లంపల్లి డివిజన్ డీఈ రాజన్న, బెల్లంపల్లి రూరల్ సబ్ డివిజన్ ఏడీఈ రాంచందర్, ఏఈఈ బాపు, సబ్ ఇంజనీర్ రాహుల్ పాల్గొన్నారు.

'మాదక ద్రవ్యాలతో జీవితాలు నాశనం'

బెల్లంపల్లిరూరల్: మాదక ద్రవ్యాలతో జీవితాలు నాశనం అవుతాయని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ అంజయ్య అన్నారు. కళాశాలలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో శనివారం యాంటీ డ్రగ్స్‌పై అవగాహన కల్పించారు. మాదక ద్రవ్యాల వాడకం వల్ల కలిగే నష్టాలు, నివారణ చర్యలపై విద్యార్థులకు వ్యాసరచన, పోస్టర్ పేయింట్ పోటీలు నిర్వహించారు. పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు.

లైబ్రరీకి పుస్తకాలు వితరణ

మంచిర్యాలఅర్బన్: ఉద్యోగం సేవచేసే అవకాశంగా భావించాలని బీఎస్‌రావు హెల్త్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు బీఎస్‌రావు అన్నారు. జిల్లా కేంద్ర గ్రంథాలయంలో శనివారం పోటీపరీక్షలకు సంబంధించిన పుస్తకాలను అందజేశారు. కార్యక్రమంలో ఐ ఎంఏ అధ్యక్షుడు వైద్యుడు పి.రమణ, కార్యదర్శి మూర్తి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు జగన్, బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు కర్రె లచ్చన్న, లైబ్రరీ ఉద్యోగి కృతిన్, మురళీ తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక చట్టాలు అమలు చేయాలి

లక్సెట్టిపేట: మహిళల రక్షణ కోసం ప్రభుత్వం ప్రత్యేక చట్టాలను అమలు చేయాలని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు ప్రభంజనం అన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ మోడల్ డిగ్రీ కళాశాలలో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. మహిళలపై అఘాయిత్యాలు పెరిగిపోతున్నాయని, విద్యార్థులపై అరాచకాలు కొనసాగుతున్నాయన్నారు. ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నాయకులు అరుణ్, శ్రీనివాస్, ఇర్ఫాన్, స్వామి, మంజు, రఫీ పాల్గొన్నారు.

వర్షానికి కూలిన ఇంటి గోడ

భీమిని: కొద్ది రోజులుగా కురుస్తున్న వర్షాలకు కన్నెపల్లి మండల కేంద్రంలో గొస్కుల బాపుకు చెందిన ఇల్లు వర్షానికి నాని నేలకూలింది. ఆ సమయంలో ఇంట్లో ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. ఇంట్లో ఉన్న నిత్యావసర సరుకులు, వస్తువులు తడిసి ముద్దయ్యాయి. దీంతో బాధితులు ప్రభుత్వం నుంచి ఆర్థికసాయం అందించాలని వేడుకుంటున్నారు.

'ఆరోపణలు మానుకోవాలి'

చెన్నూర్: వేమనపల్లి మండలంలోని మంగనపల్లి పాఠశాల ఉపాధ్యాయులు చేస్తున్న తప్పుడు ఆరోపణలను మానుకోవాలని కేవీపీఎస్ చెన్నూర్ మండల కన్వీనర్ జిమిడి కుమార్ అన్నారు. శనివారం స్థానికంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉపాధ్యాయులు కక్షపూరితంగా డబ్బులు డిమాండ్ చేశాడని మోహన్‌పై తప్పుడు ఫిర్యాదు చేశారని తెలిపారు. ఈ విషయాన్ని తాము తీవ్రంగా ఖండిస్తున్నామని పేర్కొన్నారు.

ఆర్థిక సాయం

దండేపల్లి: మండలంలోని కాసిపేటకు చెందిన ఆవుల విమల ఇటీవల భర్త చేతిలో హత్యకు గురైంది. ఆమె భర్త నరేశ్ జైలుకు వెళ్లాడు. అనాథలుగా మారిన ముగ్గురు పిల్లలకు ప్రభుత్వ పాఠశాల హెచ్ఎం వకుళ రూ.5వేలు ఆర్థికసాయం చేశారు.

చెన్నూర్: చెన్నూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1993–94లలో పదో తరగతి కలిసి చదువుకున్న చిన్ననాటి స్నేహితుడు తుమ్మ కిష్టయ్య కుమార్తె లావణ్య వివాహానికి బాల్య మిత్రులు బాసటగా నిలిచారు. స్థానికంగా శనివారం జరిగిన వివాహ వేడుకలో రూ.70,051అందజేశారు.

బెల్లంపల్లిరూరల్: మండలంలోని పెర్కపల్లికి చెందిన జంగిపెల్లి స్వామికి అనారోగ్యంతో బాధపడుతుండగా వైద్య ఖర్చుల కోసం శనివారం బెల్లంపల్లిలోని జనహిత సేవా సమితి ఆధ్వర్యంలో దాతల సహకారంతో రూ.11వేల చెక్కును సేవా సమితి అధ్యక్షుడు ఆడెపు సతీష్ అందజేశారు.

దండేపల్లి: మండలంలోని కొండపూర్‌కు చెందిన అజయ్, చరణ్ ఇటీవల గోదావరిలో మునిగి మృతి చెందారు. కాసిపేటకు చెందిన విమల, మ్యాదరి పేటకు చెందిన ఉస్మాన్‌ఖాన్ వివిధ కారణాలతో మృతి చెందారు. వీరి కుటుంబ సభ్యులకు శనివారం ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావు సానుభూతి తెలుపుతూ ఒక్కో కుటుంబానికి రూ.5వేలు సాయం చేశారు.

సమస్యల పరిష్కారానికి అధిక ప్రాధాన్యం

నస్పూర్: పట్టణ పరిధిలో నెలకొన్న పలు సమస్యల పరిష్కారానికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నట్లు మున్సిపల్ చైర్మన్ సురిమిల్ల వేణు తెలిపారు. పట్టణంలోని 21వ వార్డులో ఇళ్లపై కప్పుల సమీపంగా వేలాడుతూ ప్రమాదకరంగా మారిన 11కేవీ విద్యుత్ సరఫరా వైర్లను చైర్మన్ ఆధ్వర్యంలో విద్యుత్ అధికారులు శనివారం మరో చోటికి మార్చారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ.. 21వార్డులో హైటెన్షన్ విద్యుత్ సరఫరా వైర్లు ఇళ్లపై కప్పు సమీపంలో ప్రమాదంగా ఉందని, పలువురు వార్డు ప్రజలు తమ సమస్యను ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావు దృష్టికి తీసుకొచ్చారని తెలిపారు. స్పందించిన ఎమ్మెల్యే రూ.6లక్షల నిధులు కేటాయించి విద్యుత్ అధికారులతో కరెంట్ సరఫరా వైర్లను మెయిన్ రోడ్డుకి మార్చారని పేర్కొన్నారు. నాయకులు మధూకర్, తిరుపతి, రవి, సత్యం, కుమారస్వామి, రమేశ్, రాజన్న, తదితరులు పాల్గొన్నారు.

తరగతి గదులకు తాళం


ఎనిమిదో తరగతి గదికి తాళం వేస్తున్న ఎంఈవో

లక్సెట్టిపేట: మండల కేంద్రంలోని శ్రీ చైతన్య పాఠశాల ఎనిమిది, తొమ్మిదో తరగతి గదులకు ఎంఈవో రవీందర్ శనివారం తాళం వేశారు. పాఠశాలకు కేవలం ఏడో తరగతి వరకు అనుమతి ఉందని, యాజమాన్యం ఎనిమిది, తొమ్మిది తరగతులు కొనసాగిస్తున్నారని ఫిర్యాదు రావడంతో తాళం వేసినట్లు తెలిపారు. అనుమతులిచ్చే వరకు తరగతులు నిర్వహించొద్దని యాజమాన్యానికి తెలిపినట్లు పేర్కొన్నారు. అనంతరం పాఠశాలలో తరగతి గదులు, రిజిస్టర్లను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సీఆర్పీలు ఉన్నారు.

నియామకం

చెన్నూర్: చెన్నూర్ బీజేపీ కార్యాలయంలో శనివారం బీజేపీ పట్టణ కార్యవర్గ సమావేశాన్ని నిర్వహించినట్లు పట్టణ అధ్యక్షుడు జాడి తిరుపతి తెలిపారు. కార్యవర్గ సమావేశంలో జిల్లా అధ్యక్షుడు రఘునాథ్ రావు వెరబెల్లి ఆదేశాల మేరకు చెన్నూర్ పట్టణానికి చెందిన గర్రెపల్లి వెంకటనర్సయ్య, తుమ్మశ్రీపాల్‌లను బీజేపీ పట్టణ ప్రధాన కార్యదర్శులుగా నియమించినట్లు తెలిపారు.

వీడ్కోలు సమావేశం


సన్మానిస్తున్న అధికారులు, నాయకులు

తాండూర్: మండల వ్యవసాయ అధికారిగా విధులు నిర్వర్తించి మందమర్రికి బదిలీపై వెళ్తున్న కిరణ్మయికి మండలంలోని కొత్తపల్లి రైతువేదికలో శనివారం వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. పది సంవత్సరాల పాటు సుదీర్ఘకాలం మండలంలో రైతులకు విశేష సేవలందించి, ఎంతో సామ్యురాలిగా, ఉత్తమ అధికారిగా కిరణ్మయి గుర్తింపు తెచ్చుకోవడం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా అధికారులు, నాయకులు డీలర్లు, రైతులు కిరణ్మయిని పూల మాలలు, శాలువాలతో ఘనంగా సత్కరించారు.

■ బొగ్గుబాయి వార్తలు

లాభాల్లో 35శాతం వాటా ఇవ్వాలి

శ్రీరాంపూర్: సింగరేణిలో గత ఆర్థిక సంవత్సరం కంపెనీ సాధించిన లాభాల నుంచి 30శాతం వాటాను కార్మికులకు పంచాలని సీఐటీయూ డివిజన్ నాయకులు యాజమాన్యాన్ని డిమాండ్ చేశారు. ఆ యూనియన్ ఆధ్వర్యంలో శనివారం కార్మికుల సమస్యపై సంతకాల కార్యక్రమం చేపట్టారు. ఆర్కే న్యూటెక్ గనిపై జరిగిన ఈ కార్యక్రమంలో నాయకులు మాట్లాడుతూ.. కంపెనీ లాభాలను వెంటనే ప్రకటించి, అందులో 35శాతం వాటాను కార్మికులకు పంచాలన్నారు. నిర్ణీత మస్టర్లు పూర్తిచేసిన బదిలీ వర్కర్లను రెగ్యులర్ చేయాలన్నారు. కార్యక్రమంలో ఆ యూనియన్ నాయకులు పెరిక సదానందం, సందీప్, రమేష్, రాజగోపాల్ పాల్గొన్నారు.

సేఫ్టీ జీఎంకు సన్మానం

శ్రీరాంపూర్: కార్పొరేట్ సేఫ్టీ జీఎం చింతల శ్రీనివాస్‌ను ఏరియా అధికారులు సన్మానించారు. ఉద్యోగ బాధ్యతలు చేపట్టిన తర్వాత మొదటిసారిగా శ్రీరాంపూర్ ఏరియాకు వచ్చిన సందర్భంగా శనివారం జీఎం కార్యాలయంలో ఇన్‌చార్జి జీఎం శ్రీనివాస్ ఆయనను మర్యాదపూర్వకంగా శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో బెల్లంపల్లి రీజియన్ సేఫ్టీ జీఎం రఘుకుమార్ జీఎం(సీఎంసీ) మోహన్ రెడ్డి, ఎస్ఓటు జీఎం సత్యనారాయణ, అధికారుల సంఘం ఏరియా అధ్యక్షుడు వెంకటేశ్వర రెడ్డి, ఓపెన్ కాస్ట్ ప్రాజెక్ట్ అధికారి ఏవీ రెడ్డి డీజీఎం అరవిందరావు, ఏజెంట్‌లు రాముడు, శ్రీధర్ పాల్గొన్నారు.

బీపీ పరికరాన్ని అందుబాటులోకి తేవాలి

శ్రీరాంపూర్: శ్రీరాంపూర్ ఏరియాలోని సింగరేణి డిస్పెన్సరీలో మాన్యువల్‌గా పరీక్షించే బీపీ పరికరాలను అందుబాటులోకి తేవాలని హెచ్ఎమ్మెస్ శ్రీరాంపూర్ బ్రాంచ్ ఉపాధ్యక్షుడు తిప్పారపు సారయ్య, కార్యదర్శి అనిల్ రెడ్డి శనివారం ఒక ప్రకటనలో యాజమాన్యాన్ని డిమాండ్ చేశారు. కరోనా సమయంలో బీపీ చెక్ చేయడానికి డిజిటల్ మీటర్లను అందుబాటులోకి తెచ్చారని తెలిపారు. ఆ డిజిటల్ మీటర్లు బీపీని ఖచ్చితంగా చూపవన్నారు కావున మాన్యువల్‌గా చెక్ చేయడానికి బీపీ పరికరాలను ఏర్పాటు చేయాల్సిందిగా కోరారు.

బదిలీ అధికారికి సన్మానం


రమేశ్‌ను సన్మానిస్తున్న అధికారులు

మందమర్రిరూరల్: ఏరియాలోని కేకే–ఓసీలో కొంత కాలం ప్రాజెక్ట్ ఆఫీసర్‌గా విధులు నిర్వర్తించి బదిలీపై వెళ్తున్న ప్రాజెక్ట్ ఆఫీసర్ రమేశ్‌ను శనివారం జీఎం ఆఫీస్‌లోని ఛాంబర్‌లో శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా అధికారులు ఆయన ఏరియాలో చేసిన సేవలు కొనియాడారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి జీఎం రాజేశ్వరరెడ్డి, పర్సనల్ మేనేజర్ శ్యామ్‌సుందర్ అధికారులు ఉన్నారు.

ఓటరు జాబితా ప్రక్రియ పకడ్బందీగా నిర్వహించాలి

తాండూర్: ఓటరు జాబితా తయారు ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలని తహసీల్దార్ ఇమ్రాన్ ఖాన్ పేర్కొన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో శనివారం బూత్ లెవల్ అధికారులు, పంచాయతీ కార్యదర్శులతో ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. బీఎల్‌వోలు గ్రామాల్లోని ఇంటింటికీ వెళ్లి ఓటర్ల వివరాలు నమోదు చేయాలన్నారు. 2025 అక్టోబర్ 01 తేదీకి 18సంవత్సరాలు పూర్తి చేసుకోనున్న యువతీయువకుల వివరాలు కూడా ముందస్తుగా ఆన్‌లైన్ చేయాలని సూచించారు. ఇప్పటి వరకు 18సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ ఓటు హక్కు కలిగి ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఓటరు జాబితాలో మార్పులు, చేర్పులు, తొలగింపుల ప్రక్రియను ఎప్పటికప్పుడు పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాస్, ఎంపీవో అనిల్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ అంజన్ కుమార్, బీఎల్‌వోలు , పంచాయతీ కార్యదర్శులు , సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

బెల్లంపల్లిరూరల్: జీవితాలను నాశనం చేసే మత్తు పదార్థాలకు విద్యార్థులు దూరంగా ఉండాలని ఏసీపీ ఏ.రవికుమార్ అన్నారు. బెల్లంపల్లి పట్టణంలోని సెయింట్ మేరీస్ పాఠశాలలో శనివారం గంజాయి, మాదకద్రవ్యాలు, సైబర్ నేరాలపై ఏసీపీ ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనంతరం యాంటీ డ్రగ్స్‌ను పురస్కరించుకుని నిర్వహించిన వ్యాసరచన, డ్రాయింగ్ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో బెల్లంపల్లి రూరల్ సీఐ అఫ్జలొద్దీన్, టూ టౌన్ ఎస్సై కె.మహేందర్, ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.